

# వణుకు

కె. వివేకానందమూర్తి

చలిరాత్రి చకచకా వూరంతా ఆలుముకుంది.

తణుకంతా వణుకుతోంది. చలికాలపు తణుకులో ప్రవేశించిన చలి ఈరాత్రి హఠాత్తుగా తీవ్రరూపం దాల్చింది.

అసంకల్పిత లక్ష్యాల కారాటపడే ప్రపంచ ప్రయత్నాన్ని అపుజేసినట్టి మనస్సు గర్వంలాగా విపరీతంగా పెరిగి వూరంతా వొళ్ళు విరిచింది. క్రమంగా అది అతిచలిగా, మహాచలిగా, పెనుచలిగా మారి వూరంతటినీ వుత్తరధృవానికి జరిపినట్లు చేసింది.

చలి భరించలేని జనమంతా వణుకుతో సతమతమయిపోతున్నారు. గొంగళీలు పరుచుకుని కంబళీలు కప్పుకొన్నవాళ్ళూ, జంబుఖానాలు పరుచుకుని ముతకరగ్గులు కప్పుకొనవాళ్ళూ, వొంటిమీద బట్టలున్నవాళ్ళూ వొంటిమీద బట్టలేనివాళ్ళూ, బట్టలేక హృదయమున్నవాళ్ళూ, బట్టలుండీ హృదయంలేనివాళ్ళూ, రెండూ వున్నవాళ్ళూ, రెండూ లేనివాళ్ళూ, ఒరిసిపడుకొన్నవాళ్ళూ, విడిగా పడుకొన్నవాళ్ళూ – వీళ్ళేవిటి వాళ్ళేవిటి? – అంతా ఏకబిగిని వణికిపోతున్నారు.

అబద్ధానికీ, అన్యాయానికీ వణకని రాజకీయనాకుకులూ, అవినీతికీ, అధర్మా

నికీ వణకని నీతి(భష్టులూ, ఆఫీసులో మేనేజరు మాటలకీ, చివరికి భార్యమాట లకీకూడ వణకని మహాగుమాస్తాలూ మొదలైనవాళ్ళంతాకూడా చలిగుప్పిట్లో మాత్రం గజగజా గిజగిజా వణికిపోతు న్నారు. మానవులకి మల్లే అంతస్తులు, కులాలు, దూరాలు,దగ్గిరతనాలూ, ఇవేమీ చలికి తెలియకపోవడంవల్ల ఎక్కడ మినహాయింపు లేకుండా వణికిపోతు న్నారు జనం. ఎందుకోగాని ప్రకృతి శక్తులకి తరతమాలు తెలియవు ?

ఊరిమీది ఆకాశంలో చలని మేఘాన్ని చాటుపెట్టుకున్న చంద్రుడు కొంత కని పిస్తూ, కొంత కనిపించకుండా — చలి కొరుక్కుతిని మిగిల్చేసిన రొట్టెముక్కలా వున్నాడు

మూలగా మిగిలిన ఒంటరి నక్షత్రం వొక్కటీ చలి భరించలేక వణికేరీతికి సాక్ష్యంగా మిణుకు మిణుకు మంటోంది.

* * *

చీకటి మరింత పెరిగింది. చీకటిలా చలికూడా పెరిగింది సెరాల్నీ, ఎము కల్నీ కొరికే ఆ చలిలో, కణ్వాశ్ర మంలో, బొట్ హౌస్ లో, కుక్కి మంచంలో, చచ్చిపోయిన పిల్లల్ని కన్న, అల్పంగా, పల్చగా, విరిగిన పక్షిరెక్కలా వున్న ఆడసీతలు ఆకులా రెప రెపలాడుతూ, గజగజా వణికి పోతూంటే, పక్కనున్న నిద్రపట్టని మగసీతాలి మగహృదయం జాలితో, నిస్సహాయతతో గిజ గిజలాడుతూ, గిల గిలా కొట్టుకుంటూ వణికిపోయింది. మగసీతాలి కాక్షణం దేవుడు ప్రపంచా న్నంతా మంచుముద్దలా చేసి రిఫ్రిజి రేటర్లో దాచుకున్నట్టుగా వుంది. ఒక్క సారి దేవుడు కనిపిస్తే అమాంతం మీదపడి ఐస్‌లో కూరేసి కప్పెట్టేద్దా మను కున్నాడు

మగసీతాలి, చలినుండి భయాన్ని ఈరోజే ప్రథమంగా నేర్చుకున్నాడు. ఇంతకాలం అతడు, చలిలో ఆహ్లాదాన్నీ, ఆనందాన్నీ మాత్రమే అనుభవించాడు. తెల్లారకట్ట సన్నగావిడిపోయే తెలిమంచు దారాలూ, క్షితిజంమీద దూరంగా సువిశా లమై పరుచుకునే నీలిమంచు పరదాలూ, కలల్లో కనబడే చల్లటి మంచుశిఖరాలూ, అంతక్రితం మగసీతాలికి 'సుఖం' అంటే ఏమిటో చెప్పాయి. ఒకప్పుడు మంచు కురిసిన చలిరాత్రులు, చలిగాలులు తన మనస్సుని గిలిగింతలు పెట్టినయి. పెళ్ళయిన తొలిరోజుల్లో అదే చలి, వెచ్చటి అనుభూతుల్నీ అనుభవాల్నీ చలి చూపించి చాలాసార్లు తనకి స్వర్గాన్ని గుర్తుచేసింది. కాని, ఎందుకో ఆ చలి యిప్పుడు తన పాలిట పాడుచలై పోయింది భయాన్నీ, బాధనీ, కలిపి తెచ్చి భార్యమీదా, తన పాత ఆలోచనల మీదా, పాత అనుభవాలమీదా పగ తీర్చు కొంటోంది.

ఎనిమిదేళ్ళక్రితం మగసీతాలుకి భార్య


పెదాలుమాత్రమే వణకడం తెలుసు. ఇప్పుడు ఆమె వొళ్ళంతా వణకడం చూస్తున్నాడు అలా చూస్తూంటే ఏదో ద్వైధీభావం మనస్సుని కలచివేస్తోంది. తన పాతకలల్లో అందంగా పేటుకుని, ఠీవిగా, గర్వంగా, ఎత్తుగా నిలబడిన మంచుశిఖరాలు విరిగి మీద పడుతున్నట్లుగావుంది. తన పాత వూహల్లో కదిలిన తెలిమంచుదారాలు తెగి తేలిపోతున్నట్లుగా వుంది. తను చూసిన నీలిమ చుపదాలు విడివడి పేలికలై పోతున్నట్లుగా వుంది

ఒక్కసారిగా, గాలికెరటాలు హోరుమని వీచాయి.

మగసీతాలు వొళ్ళంతా గగుర్పాటుతో కుదుపుకుని — 'చలి ఎంత భయంకరమైనది ?' — అనుకున్నాడు. అప్పుడు ఆడసీతాలు యిటుగాచుత్తిగిలింది చలితో, భయంతో వణికిపోతున్న భార్య వొంటికి తగిలింది, కప్పులోంచి జారిన సన్నటి వెన్నెలరేక వెలుగులో ఆమె అతనికంటికి క్షణంపాటు పాత ఆడసీతాల్లా ఉజ్జ్వలంగా కనబడింది

ఎనిదేళ్ళక్రితం మగసీతాలి జీవితంలో కాలుమోపిన ఆడసీతాలు అలా వణకడం ఎప్పుడూ అతడికి తెలియదు నాలుగుసార్లూ ఆమె నలుగురు చచ్చిన పిల్లల్ని కన్నప్పుడు నిద్రపోతున్నట్లున్న పసికందుల శవాల్ని, నిస్సహాయుడైన భర్త నిర్జీవనేత్రాల్ని చూసికూడా వణకని ఆడసీతాలు, గుండెల్లో తను తల్లి కాలేదన్న అసమగ్రత నిండి, పొంగి, వరదై ప్రవహించినప్పుడు ఆమె ఆడహృదయం పగిలిపోయినాకూడా వణకని ఆడసీతాలు; భర్త, తన చేతుల్లో పెంచిన పాతికేళ్ళ యజమాని పీతాంబరందగ్గర అమాయకుడిలా వణికే రీతిని, అతడి ఆరోగ్యపు మొహమాటాన్నీ (unhealthy inhibition), భయాన్నీ, చేతకాని తనాన్నీ చూసినప్పుడు మిగిలే నిరాశా నిస్పృహాలు తన్ను పిచ్చిదాన్నిగా చేసిన క్షణానకూడా వణకని ఆడసీతాలు, భాగ్యం నడిచే బంగళాలో మూలగావున్న ఔట్ హౌస్ నీడల్లో గర్భ్రం షికారు చేసినా కూడా వణకని ఆడసీతాలు, పల్చగా, అల్పంగా, విరిగిన పక్షిరెక్కలా వున్న ఆడసీతాలు, తన కంటిముందు ఈక్షణం— జీవితం మనస్సూ, పరిస్థితులూ అంటే ఏమిటో తెలియని పిచ్చిచలి చేతుల్లో వజవజా వణికిపోతూంటే చూసి భరించలేక దీలాపడిపోయిన మగసీతాలు, దుఃఖం నిండిన జీరగొంతుకతో వ్యగ్రంగా, వినీవినిపించని స్వరంలో, 'కంబళీ ! కంబళీ !' అని గొణిగి, దాధపడి వణుకుతున్న కాపుని భార్యలాంటి సపోటా చెట్టుకేసి వెర్రిపీనుగులా చూశాడు

చలిరాత్రి మరింత విజృంభించగానే, వేదనల మధ్య వణుకు మరిచిన మగసీతాలికి తనుకూడా వణకడం గుర్తుకు వచ్చింది ఎక్కడ పక్కలో పడుక్కున్న




"సబ్బూ గిబ్బూ తర్వాత రుద్దుకోవచ్చు, ముందు వొళ్లు తడుపుకు లేవయ్యా!
మేమింకా నలుగురు మున్నాము

---

ఆడసీతాలు తనకి రెట్టింపుగా వణికిపోతూ కనబడింది తమ వణుకు మూలాన వూగిసలాడుతూన్న మంచంకూడా చలి భరించలేక వణికిపోతూన్నట్టు కనబడింది. పాతరోజుల్లో ఎంతో సరదాగా, వేడిగా వుండే భార్య, యిప్పుడీ చలి నిద్రలో అమాయికంగా, కాలిపోయిన కాయితంలా వణికిపోతూంటే అతడి మస్తిష్కంలో తయారైన ధైర్యం, భయం కళ్ళల్లో నీటిని తిప్పాయి వెంటనే మగసీతాలు చలి నివారణ గురించి తీవ్రంగా ఆలోచించాడు. కొంత సేపు అలా ఆలోచనల్తో వణికి క్రమంగా అతడు నిద్రలోకి జారేడు.

నలభైయ్యేళ్ళ మగసీతాలి అసలు పేరు సీతన్న. పెళ్ళయ్యేదాకా అతడు 'సీతాలు'గా పెరిగాడు ముప్పయ్యేళ్ళ ఆడసీతాలి అసలుపేరు సీత. పెళ్ళయ్యేదాకా ఆమెకూడా 'సీతాలు' గానే పెరిగింది అందుకని మగసీతాలి భార్య పేరు 'ఆడసీతాలు', ఆడసీతాలి భర్త పేరు 'మగసీతాలు'.

తణుకులో కోవెల వీధిలో వున్న 'కణ్వాశ్రమం' అనే బంగళా పెరట్లో వున్న ఔట్ హౌస్‌లో మగసీతాలి తాత ముత్తాత లంతా నివాసం వుండి, బంగళా బాగోగులు పరిశీలిస్తూ, యజమానుల వ్యవహారవు లెక్కలూ అవీ చూసే గుమాస్తాలుగా బ్రతికారు మగ సీతాలు కూడా యిప్పుడలాగే బ్రతుకుతున్నాడు.

తన జీవన పరిధిలో కణ్వాశ్రమంలో మగ సీతాలి కంటిముందు ఎన్నో మార్పులు జరిగాయి. పదేళ్ళ క్రితం ముసలి తండ్రీ, ముసలి తల్లీ, ముసలిభార్యని కోల్పోయిన ముసలి యజమానీ దగ్గుతూ, మూలుగుతూ, ఆయాస పడుతూన్నప్పుడు నెలల తేడాలో వాళ్ళ ప్రాణాలు ఆశ్రమం ప్రహరీ దాటి వెళ్ళిపోయాయి. దాదాపు అప్పుడే అదే ప్రహరీ దాటి వీధి మీదికి వంగిన ముసిలి కొబ్బరిచెట్టూ, దాన్ని చుట్టుకు పాకిన పడుచు బచ్చలితీగే వాడి, ఎండి, హరించుకుపోయాయి. తర్వాత మగసీతాలిచేతుల్లో, బుజాలమీదా పెరిగిన పీతాంబరం అనబడే చచ్చిపోయిన ముసిలి యజమాని ఏకపుత్రుడు యజమాని అయ్యాడు. వెంకులక్ష్మిని పెళ్ళాడి గృహస్థు అయ్యాడు.

కణ్వాశ్రమం, వూళ్ళో పలుకుబడీ, వూరు చుట్టుపక్కల భూములూ, బ్యాంకులో వడ్డీ పెంచుకు నీలుగుతోన్న డబ్బూ, యింట్లో డబ్బుతో నీలుగు తోన్న యినపెట్టె, యిప్పుడు షాపుల వాళ్ళు షోకేసుల్లోంచి తీసి దాచేసిన కోవకిచెందిన బంగారపునగల బరువుతో తూలే వెంకులక్ష్మి అనే భార్యేకాక, పీతాంబరానికి మద్రాసు తాంబరంలో బట్టలషాపూ, మాంబళంలో వాచీల షాపూ, హైద్రాబాదు సిద్దియంబర్ బజారులో ఒక మందులషాపూ, రెండు మందుషాపులూ వున్నాయి. ప్రస్తుతం వొంటిమీద చలికి నిగిడ్చిన రోమాలూ, ఒక పెద్ద కాశ్మీరు కంబళీ వున్నాయి.

ఇవేం లేని మగసీతాలికి తన అనారోగ్యపు మొహమాట ఫలితంగా యింట్లో నిలిచిన దరిద్రం, తన చేతుల్తో పెంచిన యజమాని నీడలో చేతకాని వాడిలా భయంతో, నమ్రతతో వంగి నిలబడే హృదయమూ, బాధ నిండిన బ్రతుకూ, చచ్చిన పిల్లల్ని కన్న, పల్చగా,అల్పంగా, విరిగిన పక్షిరెక్కలా వుండే ఆడసీతాలు అనెడు భార్యా వున్నారు. యిప్పుడతని తలెంపుదిక్కున పంచన అతడి దరిద్రంలా పెరిగినా కాపు లేని సపోటాచెట్టు వుంది.

మగసీతాలు, పెళ్ళయిన కొత్తలో దాన్ని నాటాడు. ప్రాణంతో సమానంగా పెంచాడు, భార్యనిలా దాన్నీ ప్రేమించాడు ఎప్పుడో నాలుగు చప్పు పిందెల్ని రాల్చడం తప్ప, అది యింతవరకూ యేనాడూ పుష్పించలేదు, ఫలించలేదు. ఔట్ హౌస్ ముందు అది అలాగే అడవి చెట్టంత పెరిగి సీతాలి చేదుబ్రతుక్కీ, లేమికీ ప్రతీకలా నిలబడివుంటుంది కాని దాన్ని చూసినప్పుడు మగసీతాలు మాత్రం తృప్తి నిండిన తన్మయత ననుభవిస్తాడు. చాలని డబ్బుతో, చాలని మనస్సుతో, పిల్లల్లేని ఎడారిలాంటి జీవితంతో, ఆడసీతాలిహృదయస్పందనతో, మెదడు దిగులుతో సంతప్త మయిన

ప్పుడు – చలినీ, ఈదురు గాలుల్నీ, ఎండనీ, వర్షాన్నీ చేవతో ఎదుర్కొని, ఆకాశంవైపు వున్నంతగా, బలంగా, ఠీవిగా, గర్వంగా పెరుగుతున్నట్టు కనిపించే, తను నాటిన సపోటాచెట్టుని చూసి, మగసీతాలు అప్పుడప్పుడు ధైర్యం తెచ్చుకుంటూ వుంటాడు దాన్ని చూసేరోజు ఎన్నో కొత్త ఆశలు పేర్చుకుంటాడు. ఎన్నో కలలు కంటాడు కాని, విచిత్రం '–అవికూడా భార్యకన్న పిల్లల్లాగే స్వరూపాలు నింపుకుని చచ్చిపోతాయి.

ఆడసీతాలుకి సపోటాచెట్టుతోగాని, భర్త ఆలోచనల్తోగాని, కలల్తోగాని నిమిత్తంలేదు. ఆమెకి మగసీతాలంటే వొక్కటే అభిప్రాయం–ఏమీ చేతకాని వాడని. ఈ అభిప్రాయాన్ని ఆమె చాలా సార్లు అతడి ముఖంమీదే వెల్లడి చేసింది ఆఖరికి ఆమె వొకసారి–మీకు పిల్లల్ని కనడంకూడా చేతకాదు–అని పిల్లల్ని కనడంలో తన పాత్రగాని, దోషంగాని లేనట్టు అతడితో చెప్పేసింది తిరిగి ఏం జవాబు చెప్పాలోకూడా చేతగాక అతను మాట్లాడక ఊరుకున్నాడప్పుడు నిజంగా మగసీతాలికి మాటలుకూడా మాట్లాడటం చేతకాదు ఒకవేళ ఎలాగో కష్టపడి మాట్లాడుదామని మాటలు నేర్చుకున్నా, వాటిని అతనికంటే ముందే ఎదటి మనుషులు మాట్లాడేస్తారు. అందుకే అతని భార్య అత న్నెప్పుడూ 'చేతకాని నీరసం మొగుడు!' అంటుంది, అనుకుంటుంది ఆమె ఏమన్నా అనుకున్నా మగసీతాలు వ్యతిరేకించడు నిజం మాట అటుంచి, అతడికి భార్యఅంటే అవధుల్లేని ప్రేమా, జాలీ పెళ్ళయిన కొత్తలో నవనవలాడుతూ సున్నితంగా కలువరేకులా వున్న ఆడసీతాలు పల్చగా అల్పంగా విరిగిన పక్షిరెక్కలా అయిపోయిందే అన్న కించ వున్నాయి అతని కష్టాల పరాకాష్టలా మగసీతాలిమీద ఇప్పుడీ చలి వొకటి విరుచుకుపడింది

చలిలో, నిద్రలో వణుకుతూన్న మగసీతాలి భావాలు ప్రస్తుతం వెన్నెల నీడల్లా మారి కణ్వాశ్రమం చెట్లక్రింద పిచ్చిగా పరుచుకున్నట్లున్నాయి

కచేరీగంట చలిగుండెమీద పడి రెండుసార్లు కోపంగా వణికింది. అయినా చలి తొణకలేదు.

* * *

తెల్లవారింది.

కలగన్న మగసీతాలు, కలలో కప్పుకున్న వూహాకంబళీని పక్కకి తొలగించుకుంటూ గాలిలో ఆకతాయిలా చేతులు వూపి లేచి కూర్చున్నాడు కాపు లేని సపోటాచెట్టుమీద నీరెండ చూడగానే అతడి కల మంచులా విడిపోయింది

మగసీతాలు మంచంమీంచి లేచాడు. పక్కన ఆడసీతాలు లేవలేని అవస్థలో వుంది రోజూ ఆ వేళకి, నిద్ర లేచిన భర్తపక్కన రుచిలేని కాఫీనీళ్ళతో నిల

బడి యింటి దరిద్రంగూర్చి, అతడి చేత కాని ప్రవర్తనగూర్చి ఉపన్యసించేభార్య. మంచంమీంచి లేవ లేక నీరసించిన కళ్ళతో దీనంగా పడుక్కుని వుండటం చూడగానే మగసీతాలికి మతిపోయి నట్టయింది ఎందుకంటే ఇదివరకు ఆడ సీతాలి కళ్ళు పాతరోజుల్లో భారతదేశపు నాగరికతలాగ, సుభిక్షంలాగ నిండుగా వుండేవి. కాని అవి ఇప్పుడు, ఇప్పటి భారతదేశపు నాగరికతలాగ కర్రప్షన్ లాగ, మన వూహలో అక్షరాస్యులపై నిరక్షరాస్యుల ప్రభుత్వంలాగ వెకిలిగా, చాలాచాలా ఏడిసినట్టు, ఏడిచినట్టు వున్నాయి ఇలా హఠాత్తుగా భార్యకి 'తల్లి' పోలిక రావడం మూలానేమో— మగసీతాలికి మతిపోయినట్టయింది.

అతను "సీతలూ!" అని కంగారుగా ఆమె వొంటిమీద చెయ్యివేశాడు చల్లటి శుభోదయం భగ్గున మండినట్టయింది ఆమెవొళ్ళు కాల్చినపసిడిసలాకలావుంది. అతను భయపడి మళ్ళీ, "సీతాలూ?" అన్నాడు.

"ఉఁవూఁ. హుఁహూఁ వుఁవూఁ. హుఁహూఁ...ఁ" అని వణికింది ఆడ సీతాలు.

"వొంట్లో బాగాలేదా?"

కళ్ళిప్పి మళ్ళీ "ఉఁవూఁ...... హుఁహూ..." అని వణికింది.

"లేవలేవా?"

"ఉఁవూఁ... హుఁహూఁ..."

"జ్వరంగా వుందా?"

"ఉఁవూఁ... హుఁహూఁ..."

"ఏంచెయ్యమంటావే మరీ?"

"ఉఁవూఁ... హుఁహూఁ..."

"డాక్టర్ని పిలిచేదా?"

"ఉఁవూఁ... హుఁహూఁ..."

"పీతాంబరాన్ని పిలిచేదా?"

"ఉఁవూఁ... హుఁహూఁ..."

"పిలిస్తే వస్తా డంటావా?"

"ఉఁవూఁ... హుఁహూఁ..."

"ఏమనుకుంటాడో?"

"ఉఁవూఁ... హుఁహూఁ..."

"సమాధానం లేకుండా అలా వణికి పోతే నే నేం చెయ్యగల న్చెప్పు. ఏం చెయ్యమంటావో చెబితే ఏదోవొకటి చెయ్యడానికి ప్రయత్నిస్తాను."

"పీఇఇహి . తాన్న్...బ్రాహ్ఁన్నిఁ పిహిఁహిఁ వుఁహుఁహుఁహూఁ...

వెంటనే గాభరాగా మగసీతాలు అప్పుడే లేచిన పీతాంబరం దగ్గరికి వెళ్ళాడు. అప్పుడే లేచిన పీతాంబరం మత్తుగా, మగతగా, వెధవలావున్నాడు.

దగ్గిరకి వెళ్ళి, "నాయినా! పీతాంబరం!" అని పిలిచాడు మగసీతాలు.

పీతాంబరంలో ఎంతో మంచితనం వున్నా, ఆలోచనాశక్తి బొత్తిగాశూన్యం ఏంమాటచెప్పినా యంత్రంలా మాట్టాడం

తప్పించి, ఎదటివ్యక్తి ఎందుకు మాట్లాడుతున్నాడో తిరిగి ఆ వ్యక్తి చెప్తేనేగాని అతనికి ఆలోచన తట్టదు. అందుకే వూరి ప్రజలంతా పీతాంబరాన్ని 'మరమనిషి' అంటారు. అతను తండ్రిలాంటి మగసీతాలి సుఖం గురించిగాని, తల్లిలాంటి ఆడసీతాలి క్షేమంగురించిగాని ఎన్నడూ ఆలోచించి ఎరగడు భార్య వెంకులక్ష్మి కూడా అతనికెప్పుడూ జ్ఞాపకం చేయదు. అందుకే మంచి అవకాశా లున్నాకూడా సీతాలుద్వయం దరిద్రంతో అవస్థలు పడుతున్నారు.

మగసీతాలి పిలుపు విని పీతాంబరం "వూ!" అన్నాడు

"సీతాలు వొణుకుతోంది."

"మీరూ?"

"నేనుకాదు నాయినా! అది — సీతాలు"

"అవును. యీ ఏడు చలి బాగా వేస్తోంది కంబళీ కప్పుకున్నా ఆగలేదు నిన్నరాత్రి"

"వొళ్ళు వేడిగావుంది నాయినా!"

"అలాగా!"

"జ్వరం తగిలినట్టుంది నాయినా దానికి!"

"అయ్యో పాపం!"

"భరించలేక వణికిపోతోంది నాయినా!"

"కాదుమరీ — చలంటే చలే అందులో నిన్నరాత్రి మరీనూ. ఈచలికి తోడు మా ఆవిడ ఫోన్ ఒకటి చేస్తుంది. వద్దేఅంటే వినదు దానికి ఫోనుచప్పుడు లేకపోతే నిద్రపట్టదుట—"

"లేవలేకపోతోంది నాయినా!"

"మా ఆవిడే? — ఎప్పుడు చూశారు?"

"కాదు నాయినా — అది — సీతాలు"

"ఓహో మీఆవిడా! అవును పాపం— యీ చలి దారుణం, యింతాఅంతాకాదు."

"ఆ డా—క్ట—ర్ని— కా—స్త— పి—లి—స్తే—"

"ఆయన తప్పకుండా వస్తాడు."

"అదికాదు నాయినా! — ఆయన్ని— కాస్త— కొంచెం— వొక్కసారి ఫోన్ చేసి పి—లు—ద్దూ నాయినా!"

"మరయితే చెప్పరేం? ఇదుగో యిప్పుడే పిలుస్తాను," అని లోపలికి వెళ్ళాడు పీతాంబరం మగసీతాలు వూపిరి తీసుకుని భార్యదగ్గరకి కదిలాడు

అరగంట గడిచాక అతికంగారుగా వచ్చాడు పీతాంబరం ఫామిలీ డాక్టరు. వుత్త కంగారు మనిషిలా వున్నాడు మాట్లాడినంతసేపూ అనవసరంగా చెయ్యో, కాలో, తలో యూడిస్తున్నాడు. క్షణకాలం ఆయన ఆడసీతాల్ని ఆదరాబాదరాగా పరీక్షచేసి, గదిలో గబగబా అటూఇటూ రెండుసార్లు తిరిగి, మగసీతాలుతో, "నా భార్యకి మలేరియా," అన్నాడు తల అనవసరంగా వూపేస్తూ.

"మరి నా భార్యకి?" అని అడిగాడు మగసీతాలు.

"అదే మీ భార్యకే – మలేరియా! – చలిజ్వరం'" అన్నాడాయన. నా భార్య మీ భార్యేలా అవుతుందని మగసీతాలు తిరిగి అడగలేదు మలేరియా మాట వినగానే అతనికి వణుకు పుట్టింది

"కంగారేం లేదు భయపడకండి! తగ్గిపోతుంది నే వెళ్తాను. అన్నట్టు యింజెక్షన్ ఒకటి పొడుస్తాను కాదు. ప్రమాదం ప్రస్తుతం ఈ టేబ్లెట్స్ వాడండి మీరుకాదు, చచ్చిపోతారు. పేషెంటు, పేషెంటుకి వాడండి –" అని మళ్ళా తల అనవసరంగా వూపుతూ టేబ్లెట్స్ పేరు కాగితంమీద రాసిచ్చి, ఎవరిచేతో దెబ్బలు తిన్నవాడిలా కంగారుగా పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు, మగసీతాలు ఆ కాగిదం తీసుకుని పీతాంబరం దగ్గరికి కదిలాడు

మధ్యాహ్నం మగసీతాలు భార్యకి టేబ్లెట్స్ వేశాడు

చీకటిపడింది ఆరాత్రికూడా చలి తగ్గలేదు. చలికాలం నిష్క్రమించే రోజులు వచ్చినా, వూరిమీద విరుచుకు పడ్డ చలిమాత్రం తగ్గలేదు చలి వేస్తూనే వుంది, మసక వెన్నెలనీ, మగసీతాల్నీ, ఆడసీతాల్నీ, సపోటాచెట్టునీ అన్నిటినీ లోకువచేసి తన సహజత్వానికి బలి చేస్తూ.

* * *

ప్రకృతి ఆవిలించినట్టు తెల్లారింది. తూర్పున వెచ్చటి సూర్యుడు వెలిగేడు, వూరంతా నిద్ర లేచింది. ఒక్కసారిగా చలితెరలు విడిపోయాయి నిన్నటివరకూ వణికినవాళ్ళంతా వణకడం మానేశారు – ఒక్క ఆడసీతాలుతప్ప, ఎండ పెరిగింది వేడికూడా పెరిగింది పగలు గడిచింది, మళ్ళీ రాత్రి వచ్చింది. కాని నిన్నటిలా రాత్రిలో పాడుచలి రాలేదు, వూరు వణక లేదు వెచ్చటి వెన్నెలక్రింద వూరంతా నిద్రపోయింది

చలి క్రమంగా తగ్గిపోయింది నాలుగు రోజులు గడిచాయి సపోటా చెట్టూ, పీతాంబరం, వెంకులక్ష్మి, కంగారుపడే డాక్టరూ అంతాకూడా వణకడం మానేవారు తనుకిప్పుడు వణకట్లేదు – కాని కణ్వాశ్రమంలో, ఔట్ హౌస్‌లో ఆడసీతాలు శరీరంమాత్రం యింకా వణుకు మరచిపోలేదు ఆమె గజగజా వణికిపోతోంది. 'రిగర్' వచ్చినట్టు వణికిపోతోంది తీరనిబెంగకి వేరైన మగసీతాలు భార్యకేసి దిగులుగా చూశాడు నీరసించిన మనస్సులో ఆలోచనలు చెదిరాయి –

మలేరియా ఆడసీతాలుకే ఎందుకు వచ్చింది? – తన కెందుకు రాలేదు? – కంగారుపడే డాక్టరు, డాక్టరు కాబట్టి భయపడి రాలేదనుకోవచ్చు మరి పీతాంబరం? – అన్నట్టు అతనిదగ్గర కాశ్మీరు కంబళీవుంది మరి తను? – తను భార్యంతబాగా వణకలేదేమో! తనకి వణకడంకూడా చేతకాదని అది ఆడ



సీతాలుమీద విరుచుకుపడింది. కష్టాల్లో వున్నామన్న ఆలోచనకూడా దానికిలేదు. అయినా, కళ్ళున్నమనుషులే సాటివాళ్ళ బాధలూ, కష్టాలూ చూసి సానుభూతి చూపనప్పుడు, కళ్ళులేని రోగంమాత్రం మనుషులపట్ల సానుభూతిని ఎలా చూపుతుంది? అసలు 'జ్వరాలకి జాలి అంటే ఏమిటో తెలియదు' – అనుకున్నాడు. అనుకుని పంచలో సపోటాచెట్టుకేసి చూశాడు. కాని ఈసారి మగసీతాలికి బ్రతుకుమీద ధైర్యం రాలేదు. కన్నీళ్ళు పొంగి వచ్చాయి. రెప్పల చివరనుండి తెగి, వణుకుతున్న ఆడసీతాలి చేతిమీదటపటపా రాలేయి అవి; ఆమె బాధగా మూలిగి మరింత వణికింది. భార్యలో అంతటి బాధని వూహించలేని మగసీతాలి హృదయం గిజ గిజ లాడింది ఆ అనుభవం తనకి కొత్త అలాంటిబాధని అనుభవించేందుకు తను మనస్సుని ఎప్పుడూ తరిఫీదుచెయ్యలేదు కూడా.

తటాలున ఆమె చీరకొంగు తీసి. చేతిమీద పడిన కన్నీళ్ళు తుడిచాడు. అతని కా క్షణం కన్నీళ్ళమీదకూడా కోపంవచ్చింది గుండెలు, తీరని బాధకీ, మనస్తాపానికీ గురయినప్పుడు, శాశ్వతత్వాన్నీ, వుప శమనాన్నీ ప్రసాదించే కన్నీళ్లు, కష్టాల్లో బుజ్జగించే కన్నీళ్ళు, సుఖాన్ని నిర్వచించే కన్నీళ్ళు – యిప్పు డెందు కిలా ప్రవర్తించాయి అని మరింత నొచ్చుకున్నాడు.

తెల్లారాక బజారుకి వెళ్ళి భార్యకి వొక కంబళీ కాని తీసుకువస్తే బావుణ్ణనుకున్నాడు. కాని కొని తీసుకువచ్చే పరిస్థితిలోలేడు తను. కనీసం పదిహేను రూపాయలైనాలేందే తనుకొనలేడు. తన దగ్గర డబ్బులేదు. పీతాంబరాన్ని అడిగితే ఇస్తాడో ఇవ్వడో? ఏవంటాడో? ఇవ్వను – అని తిరస్కరిస్తే – వొకవేళ ఇస్తే మాత్రం అడగటం బాగుంటుందా? – తనే చేతుల్లో కొడుకులా పెరిగిన పీతాంబరాన్ని పదిహేనురూపాయిలిమ్మని యాచించడమా? న్యూనతకాదూ? – ఇలా తన సహజధోరణిలో మొహమాటపడి చివరికి పీతాంబరాన్ని ఏమైనా డబ్బు అడగకూడదని నిశ్చయించుకుని మగసీతాలు మథనపడుతూండగా, గంటలు అర్ధరాత్రివేపు నడిచాయి

ఆడసీతాలు ఇంకా అలాగే ఎగురవేసిన జాతీయజెండాలా రెపరెపలాడుతూ వణికిపోతోంది. మగసీతాలు ఇక ఆమె వణుకు చూడలేకపోయాడు. అతనిలో స్థిరత్వం పూర్తిగా తొలగిపోయింది. ఆ క్షణంలో కనుక తనభార్యకి ఏదో వొక ఆచ్ఛాదనలేకపోతే, ఆమె చచ్చిపోవడం ఖాయం అని భయపడ్డాడు. భార్యచావుని వూహించిన మస్తిష్కం స్తంభించింది. వెంటనే అతడు అసంకల్పితంగా లేచి నిలబడ్డాడు. తొడుక్కున్న చొక్కా విప్పి ఆమె వొంటిమీద కప్పేడు అతడు మరింతగా వణకడం తప్పించి, ఆమె వణుకు ఏమాత్రం తగ్గలేదు. గదిమూలల్ని నిశితంగా చూశాడు. దణ్ణెంమీద దారంపోగులు తప్పిస్తే వొక్కగుడ్డ పేలికకూడా కనబడలేదు అతను పిచ్చెత్తినట్టు పచార్లుచేయుట ప్రారంభించాడు. అతడి ఆలోచన లిప్పుడు వొకక్రమంలో లేవు. తన సుఖాన్నెవరో వురితీస్తున్నట్టుగా వుందతనికి. మౌనంగా యింత సేపూ వణికిన ఆమె, యిప్పుడు మూలగడంకూడా మొదలుపెట్టింది. చేతగానివారు వీణవాయించినట్టు ఆమె గొంతు అస్తవ్యస్తంగా వణుకుతోంది. ఒక్కసారి బైటికిచూశాడు దూరంగా బంగళా పడగ్గదిలో సన్నటి బెడ్‌లైటు కాంతి కిటికీ చువ్వలమీద పడి, తన దీనస్థితిని వెక్కిరిస్తోన్నట్టుంది. ఏదో తెలియని ఆవేశం వొంట్లోకి పాకింది. అతడు ఔట్‌హౌస్ బైటకి వచ్చాడు.

బంగళావేపు వడిగా అడుగులు వేస్తూ నడుస్తున్నాడు – కర్యాక్రమం చెట్లనీడల్లో

నీడలా - దరిద్రునికీ. మొహమటానికీ నలభై ఏళ్ళ పాతబడ్డ మగసీతాలు, భార్యని రక్షించుకోవాలనే తాపత్రయం తప్ప అతని మనస్సులో యింకేభావం లేదు రెండు నిమిషాల తర్వాత వరండాలో అడుగుపెట్టాడు. బల్లమీద రాత్రి కాపలాకాసే రంగన్న, కుక్కలా ముడుచుకు పడుకుని మొద్దునిద్ర పోతున్నాడు బల్లక్రింద వీధితిండి తప్ప ఇంటితిండి తినని పెంపుడుకుక్క రంగన్నలా మొద్దునిద్దర పోతోంది.

మగసీతాలు మౌనంగా దక్షిణవేపు నడవలోకి నడచి, పీతాంబరం పడగ్గది సమీపించాడు గదికున్న పెద్ద తలుపులు తీసి వున్నాయి వాటి వెనుకనున్న కటకటాల తలుపులు మాత్రం లోపల గెడపెట్టి వున్నాయి అతను క్షణం ఆగాడు, ఆలోచించాడు మనస్సుకూడా ఆవరించిన నిశ్చయం మరేభావానికీ చోటివ్వలేదు మువ్వల్లోంచి చేతులు లోపలికి పెట్టి గడియతీశాడు కటకటాలు తెరుచుకున్నాయి లోపలికి నడిచాడు ఆన్ చేసిన ఫాన్ చలిపెడుతోంది అయినా అతని వొళ్ళు వేడెక్కింది. చెవుల్లోంచి వేడిగాలి వీచింది తను చేసేది 'తప్పు' అని అతని కనిపించలేదు కాని కొన్ని క్షణాల క్రితం, పీతాంబరానికి తన అవసరాన్ని నిజాయితీతో నివేదించుకోవటము తప్పుగా, యాచనగా, తక్కువతనంగా తోచి మొహమాట పడ్డాడు. యింత క్రితమే న్యాయంలో నైచ్యాన్ని చూసిన తను, ఇప్పుడు స్వార్థం కోసం చెయ్యరాని తప్పు చేయబోతున్నాడు. ఒకప్పుడైతే మగసీతాలు విచక్షణతో యివన్నీ ఆలోచించేవాడే. కాని ఇప్పుడతను వివశుడు. భార్యచలిబాధా, జ్వరం బాధా అతడి మనస్సుని పూర్తిగా తినివేశాయి.

నెమ్మదిగా మంచంవైపు కదిలిన మగసీతాలు చకితుడయాడు. ఎదుటి దృశ్యం అతన్ని చల్లబరిచేసింది. అతను కృంగిపోయాడు. బోట్ హౌస్‌లో ఆడసీతల్లా వణికిపోయాడు.

ఎదురుగా నగిషీలు మలిచిన పందిరి మంచంలో అతిమెత్తటి పరుపుమీద, సుతిమెత్తని వెంకులక్ష్మి, పాతికేళ్ళ యౌవనంగల పీతాంబరమూ, చిందరవందరగా, మాసిపోయిన బూతుబొమ్మల్లా పడుకుని, గాఢ కౌగిలిలో గాఢ నిద్ర పోతున్నారు పీతాంబరానికి వొంటిమీద బట్టల్లేవు. వెంకులక్ష్మికి వో మాదిరిగా వున్నాయి జాకెట్టు సగం తొడుక్కుని బద్ధకం వేసి మానేసినట్టుంది చీరె కొంత కట్టుకున్నాక మిగిలింది కట్టుకొనడం తెలియకో, మరిచిపోయో అలాగే వదిలేసినట్టువుంది మంచువాన లాంటి అతిచల్లటి ఫానుగాలిలో, నిద్దట్లోవున్న భార్యాభర్తలిద్దరూ ప్రపంచం తెలియని పసికందుల్లా, వణికిపోతూ కనిపించారు. మగసీతాలు, భార్యకోసం దొంగిలించి

తీసుకుపోదామనుకున్న కాశ్మీరు కంబళీ వాళ్ళ వొంటిమీద లేకుండా, మంచం అంచునుండి జారి నేలమీదికి పరుచుకు పడివుంది.

ఈ దృశ్యం చూసిన మగసీతాలి హృదయంలో వొక్కసారిగా భావ సంచలనం చెలరేగింది - అతను తల తిప్పి గదిగోడలు చూశాడు. అవి కణ్వా శ్రమానివి. తన్ను కన్న కణ్వాశ్రమా నివి. తనకి నలభై యేళ్ల ఆశ్రయా న్నిచ్చిన ఆశ్రమానివి. కణ్వాశ్రమం తనకి ఉనికి నిచ్చింది. దాని యజమాని తిండీ, గుడ్డా యిచ్చాడు. దాని చెట్లు చల్లటినీడ నిచ్చాయి. యిప్పుడు తన కంటిముందు నిద్రిస్తున్న పీతాంబరానికి పాతికేళ్ళ క్రితం భయం భక్తీ చెప్పాడు. లాలించాడు, బుజ్జగించాడు, బాధ్యతలు నేర్పాడు, యజమానిగా చేశాడు. ఇంత చక్కటి పవిత్రమైన గతాన్ని తయారు చేసిపెట్టి, తన బ్రతుక్కి ఆసరా ఇచ్చిన కణ్వాశ్రమంలో, తనకి జీవనోపాధి కల్పించిన యజమాని పీతాంబరానికి, పాతికేళ్ళపాటు మంచితనపు చల్లదనంతో పీతాంబరాన్ని తాకిన ఈ చేతుల్తో, ఇప్పు డీ క్షణం భార్యసుఖం కోసం, తన స్వార్ధంకోసం మోసం చెయ్యడం! ఛీ- కూడదు. వ్యక్తిత్వాన్ని హీనపరచి, మనిషి విలువల్ని నాశనం చేసే అవకా శము దరిద్రునికి యివ్వకూడదు - అని నిశ్చయించుకొన్నాడు.

మగసీతాలిలో యిప్పుడు చైతన్యం ప్రవేశించింది ముందుకి వంగి, క్రిందికి జారిన కంబళీని తీసి, ఫానుగాలికి వణు కుతూ నిద్రిస్తున్న దంపతులిద్దరికీ మెడ వరకూ నిండుగా కప్పేడు. ఇప్పు డతని గుండెలో చక్కటితృప్తి మెరిసింది. మెల్లగా వెనుదిరిగాడు. బంగళా విడిచి ఔటొహౌస్ వేపు అడుగులు సారిస్తూన్న మగసీతాలులో వొక మంచిపని చేశా నన్నహాయి దేదీప్యంగా వెలుగుతోంది. అతడి మనస్సు కిప్పు డెంతో 'రిలీఫ్'గా వుంది.

మర్నాడు ఆకాశం బావులేదు. చెది రిన మేఘాల్తో చింపేసిన బ్లూ చీరె పరిచినట్టుంది

వణికేఆడ సీతాలుకి మెలుకువొచ్చింది. కళ్ళిప్పితే పక్కన నీరసించిన భర్త కనిపించాడు ఆమె సన్నటి వణుకు స్వరంతో ప్రారంభించింది

"ఏమండీ' ఈచలిబాధ నే నికభరించ లేను యిలా చూడండి వొక్కసారి. ఎలా వణికిపోతున్నానో! యిలా వొక్క సారి వొళ్ళు ముట్టుకు చూడండి, ఎలా కాగిపోతోందో? మీకు బాధేయటం లేదూ? అలా ముఖం దించుక్కూర్చుంటే ఏంలాభం చెప్పండి? ఈ పాడుచలి నా ప్రాణాలు కొరుక్కు తినేస్తోంది లేచి వెంటనే బజారు కెళ్ళి నాక్కప్పేందు కేమన్నా కొనుక్కురండి ఏమి టలా వెర్రిచూపులు చూస్తారు? యిన్నాళ్ళు

కలిసిబతికాక మీ చూపులు యీపాటి అర్థం చేసుకోలేవా – డబ్బులేదనేగా? మీ పిచ్చిగానీ ఎక్కడన్నా పేదవాళ్ళకి డబ్బుంటుందా! డబ్బుంటే అసలు మనం పేదవాళ్ళ మెందుకవుతాం? చలిగుప్పిట్లో ఎందుకిలా వణికిపోతాం? కాబట్టి లేవండి! లేవండి రాజా లేవండి! లేచి వేగిరం ఆ పీతంబరాన్ని వో యిరవై రూపాయి లిమ్మని అడగండి! ఆ డబ్బుకుచ్చుకుని పార్క్ గుండా బజారుకి పరిగెత్తి నే చచ్చిపోయే లోపల కంబళీవో, దుప్పటీవో ఏదో వొకటి తీసుకొచ్చి కప్పండి! యిదుగో చెబుతున్నాను, మీ రలా కూచుంటే కాసేపటికల్లా చచ్చి శవాన్నయిపోతాను. ఆ మీదట మీరు పెళ్ళాం లేని చేతకాని నీరసం మొగుడై పోతారు తర్వాత మీ యిష్టం! నే చచ్చిపోవడం మీ కిష్టమైతే మీ యిష్టం' నే నిక మాట్లాడలేను. నాలో ఓపిక చచ్చిపోయింది. కాస్సేపటికి నా వోపికలాగే నేనూ చచ్చిపోతాను ఏమండీ!– లేవండీ!– ఏవండీ!– లేవండీ!– లేవండీ!– ఏవండీ'– ఏవండీ!– లేవండీ!– లేవండీ! ఏవండీ!!.''

మగసీతాలులో యిక మగతనం విజృంభించకుండా వుండలేకపోయింది. వేగిరం వెళ్ళి పీతాంబరాన్ని కలిశాడు. మగసీతాలు వెళ్ళేటప్పటికి పీతాంబరం స్నానం ముగించి బట్టలు తొడుక్కునే ప్రయత్నంలో వున్నాడు కాని భార్య రోదన చెవుల్లో యింకా గింగురు మంటూండడంవల్ల వెంటనే మాటలు కూడ తీసుకున్నాడు.

"నాయనా పీతాబరం! దానికి జ్వరం యింకా తగ్గలేదు."

"అవును. అదోపట్టాన తగ్గేజ్వరం కాదు; మలేరియా ఓసారి మా తాతయ్యకిలాగే –"

''దానివణుకూ. జ్వరమూ''

"అదే, ఆ వ్యాధిలక్షణం అదే ''

"కాదు నాయినా –''

"అవును ''

"చలికి బిగుసుకుపోతోంది నాయినా! కప్పుకోడానికి ఏమైనా వుంటే బాగుణ్ణని –''

"తక్షణం కంబళీ వొకటి కొని కప్పండి !''

''ఆదేనాయినా ! కంబళికి డబ్బు కావాలి, నువొక్క యి – ర – వై – సద్దితే –''

''ఓ ' అదాసంగతి. నాకసలు తట్టనేలేదు అయినా డబ్బు లేదని వాకెందుకు

చెప్పలేదు మీరు? నా కేవిషయం ఓపట్టాన తట్టిచావదని మీకుమాత్రం తెలియదూ? బలేవారే! యిదుగో డబ్బు. వెంటనే కొని తీసుకొచ్చి కప్పండి పాపం,'' అని మగ సీతాలకి డబ్బిచ్చాడు.

వీధిమీది కొచ్చిన మగసీతాలు ఎవరో కడుపు కెలికినట్టు బాధపడ్డాడు. పాతికేళ్ళయి పీతాంబరం మనస్సువి ఈపాటి అర్ధంచేసుకోలేని తను నిజంగా భార్య చెప్పినట్టు 'చేతకాని నీరసంమొగు'ణ్ణను కున్నాడు. నిన్నరాత్రి చేద్దామనుకున్న పని చేయునందుకు తనని తానే అభినందించుకున్నాడు. బురదలో అడుగు వేయబోయి గుర్తించి కాలు వెనక్కి తీసుకున్నట్టుగా, విషం కలిపిన కాఫీని త్రాగబోయి ముందే తెలుసుకున్నట్టుగా వుంది. యజమానిమీది కృతజ్ఞత మిగిల్చిన సంతోషం మనస్సంతా వ్యాపించింది. సపోటాచెట్టు ఫలించినట్టూ, భార్య బ్రతికున్న పిల్లల్నికన్నట్టూ సంబరపడ్డాడు.

బజారువదిలి కొత్తబలముతో, కొత్త వుత్సాహంతో, కొత్తకంబళితో కబ్వాశ్రమం వేపు పరుగులాంటి నడక నడిచాడు. సపోటాచెట్టు నీడలోకి – ఔట్ హౌస్ గుమ్మంలోకి ఆత్రంగా వచ్చేశాడు. ఆడసీతాలి మంచం వేపు కదిలిన మగ సీతాలు వున్నట్టుండి ఆగిపోయాడు. అతను భార్యమీదికి వంగున్నాడు – అరగంట క్రితందాకా విరామం లేకుండా వణికిన ఆడసీతాలు యిప్పుడు కదలికలు మరిచినట్టు రాయిలా నిశ్చలంగా అయిపోయింది. కాగిపోయే వొళ్లుగల ఆడసీతాలు ఇప్పుడు మహాచల్లగా వున్న మంచుముక్కలా అయిపోయింది. విరిగిన పక్షిరెక్కలాంటి ఆడసీతాలు, తిరిగిన పక్షిరెక్కలా ఆలాగే పడివుండి రెపరెపలాడటం మానేసింది.

ఆశ్రమం చెట్లమీద ఉండుండి చినుకులు రాలుతున్నాయి – ప్రకృతి రోదిస్తున్నట్టు, కాపులేని సపోటా చెట్టు కొమ్మలమీద పాకే చలిచీమలు, ఆకుల చివరిదాకా జారి నేలమీదికి రాలిపోతున్నాయి.

త్వరితంగా భార్య వొంటిమీద కప్పాలని తెచ్చిన కంబళీని, అనుకొన్నట్టే ఆడసీతాలి వొంటిమీద కప్పేడతను అలా కప్పేటప్పుడు, ఏడిచిఏడిచి కన్నీళ్ళన్నీ కోల్పోయిన మగసీతాలి కళ్ళు దీనాతి దీనంగా చెమర్చాయి – భార్య మెడదాకా కప్పదామనుకున్న కంబళీని తలచివరివరకూ కప్పాల్సి వచ్చినందుకేమో!